# జాంబవంతుడి కల

జాంబవంతుడు మహాబలశాలి. దీక్షాపరుడు. స్వామికార్య తత్పరుడు. ఆదర్శప్రియుడు. స్వాతంత్ర్యవాది. సుగ్రీవుడు వాలి పీడ వదిలించుకుని రాజ్యానికి వచ్చినప్పుడు కిష్కింధ ప్రజలు ఓ బలశాలి అయిన నియంతను వదిలించుకుని స్వాతంత్ర్యం సంపాదించారు. అందుచేతనే జాంబవంతుడు సుగ్రీవుడి పక్షమైనాడు. వాలి తిరిగి వచ్చినాక సుగ్రీవుడితోపాటు జాంబవంతుడుకూడా ఇల్లూ వాకిలీ వదిలి రుష్యమూకంమీద ఆకులూ అలములూ మేస్తూ అజ్ఞాతంలో గడిపాడు.

శ్రీరామచంద్రుడు రుష్యమూకానికి వచ్చేవరకూ కిష్కింధ రాజకీయాలకు విముక్తి లేకపోయింది. శ్రీరాముడు వాలిని చంపటానికి ఒప్పుకున్నాడనేకాదు. ఆ అవతార పురుషుడు రావణుడి మీదకూడా ధ్వజమెత్తాడు. ఇది చాలా ప్రధానమైన విషయం. ఎందుచేతనంటే కిష్కింధ ప్రజలింకా స్వాతంత్ర్యార్హులు కారు. వారికి కావలసింది వాలి వంటి నియంతే. కిష్కింధలో గట్టి ప్రభుత్వం ఉంటేనేగాని రావణుడు కిష్కింధను మింగేస్తాడని ప్రజల భయం. ఈ భయంతో వాళ్ళు వాలి దుండగాలన్నీ సహించారు. వాలి రావణుణ్ణి పట్టుకుని మూడు చెరువుల నీళ్ళు తాగించిన సంఘటన వాళ్ళు ఎన్నడూ మరవలేదు. రావణుడు కిష్కింధను ఎన్నడూ జయించగోరలేదు. కాని ఆ సంగతి ప్రజలకెట్లా తెలుస్తుంది?

వాలిలేని కాలంలో సుగ్రీవుడి పరిపాలనను ప్రజలు సాగనివ్వలేదు. అడుగడుగునా సుగ్రీవుణ్ణి వారు ముప్పదిప్పలు పెడుతూవచ్చారు. అంగదుడూ, నీలుడూ, నలుడూ, జాంబవంతుడూ, హనుమంతుడూ అండలేకపోతే సుగ్రీవుడు ఏనాడో పారిపోవలసినవాడు. వాలి వచ్చిన మరుక్షణం సుగ్రీవుణ్ణి వీళ్ళుకూడా రక్షించలేకపోయినారు. అందరూ కలిసి ప్రాణాలు దక్కించుకోవలసి వచ్చింది.

శ్రీరామచంద్రుడు అన్న రెండుమాటలూ నిలబెట్టుకున్నాడు. వాలి చచ్చాడు. రావణుడూ చచ్చాడు. కిష్కింధలోనూ, లంకలోనూ కూడా ప్రజాప్రభుత్వాలేర్పడ్డాయి. అయోధ్యలో – చెప్పనే అక్కర్లేదు – రామరాజ్యం ఆరంభమయింది.

కాని జీవితంలో – రాజకీయ సాంఘిక జీవితంలో – జాంబవంతుడాశించిన మార్పు రాలేదు. మొదటిసంగతి, కిష్కింధలో రాక్షసగణం సంఖ్య హెచ్చింది. లంకకూ

కిష్కింధకూ ఏర్పడిన కొత్త సంబంధాలను పురస్కరించుకుని ఇది తప్పనిసరేమో అనుకున్నాడు జాంబవంతుడు. కాని ఈ రాక్షసులు కిష్కింధలో అనుభవించే హక్కులు మామూలు ప్రజలకు కూడా లేకుండా ఉన్నాయి. ఇదెందుకో జాంబవంతుడు ఊహించలేకపోయినాడు. వీరిని గురించి ఆరా తీయగా వీరిలో చాలామంది విభీషణ పక్షంవారు కారనీ, కేవలం రావణపక్షీయులనీ, యుద్ధకాలంలో అనేక లక్షల కిష్కింధా పౌరులను హతమార్చిన వారనీ జాంబవంతుడికి తెలిసివచ్చింది. కాని అడిగేవారెవరు? కావటానికి జాంబవంతుడు కూడా ఒక మంత్రే అయినా, అతనికిప్పుడు సుగ్రీవుడి దర్శనమే లభించదు. ఈ రాక్షసుల కందరికీ రాముడి అధికార్లు రాసి యిచ్చిన యోగ్యతా పత్రాలున్నాయి. వారు కిష్కింధ యొక్క విదేశ వ్యాపారాన్ని గుత్తకు తీసుకోవటమేకాక, కిష్కింధ నామరూపాలు లేకుండాపోయే ఒడంబడికలు తయారు చేసి వాటి మీద సుగ్రీవుడి చేత సంతకాలు పెట్టిస్తున్నారు.

ప్రజల స్థితి చూడబోతే అధ్వాన్నం చతుర్మధ్యంగా ఉంది. ప్రజాస్వాతంత్ర్య సమరంలో వీరోచితంగా ప్రాణాలర్పించినవారి కుటుంబాలకు ఆలనా, పాలనా లేదు. గెలిచి వచ్చిన వారి గతి కూడా విచారించేవారు లేరు. సైన్యంలోకి కొత్త అధికార్లు వచ్చారు. అందులో చాలామంది వాలికి నమ్మిన బంట్లు. మరి కొందరు యుద్ధ కాలంలో రావణుడి సొత్తు సంపాదించుకున్న దేశద్రోహులు. కొందరు సాక్షాత్తూ రావణుడి యుద్ధ నిపుణులే.

కిష్కింధలో ఒక వంక విందులూ, తెగుళ్ళూ, మేజు వాణీలు, నృత్యాలూ, రాక్షస స్త్రీలతో విహారాలూ, మరొక వంక దారిద్ర్యమూ, ప్రజల బాధలూ, ఆచూకీ దొరకని రాక్షస చర్యలూనూ. మంచి మంచి తినుబండారాలూ, తాగుళ్ళూ, ఇళ్ళూ, ఉద్యోగాలూ ప్రజలకు అందుబాటులో లేవు. కిష్కింధ బజార్లలో రాక్షస భాషా, రాక్షస సంప్రదాయాలూ కనిపిస్తున్నాయి. రావణ కుంభకర్ణులను కీర్తించుతూ పుస్తకాలు వెలువడుతున్నాయి.

కుర్రకారు విప్లవకారులు రహస్య కూటాలు ఏర్పరుస్తున్నట్లు వినికిడి జాస్తి అయింది. రోజూ అరెస్టులూ, ఖైదు శిక్షలూ జరుగుతున్నాయి. ఋష్యమూకం గుహలలో కొందరు విప్లవవాదులు చేరినట్టు వార్త వచ్చింది. ఆ ప్రాంతంలోకి షికారుకూ, పిక్నికుకూ వెళ్ళిన రాక్షస శ్రేష్టులూ వారి స్త్రీలూ కొందరు మాయమైనారు. రాక్షస నాయకత్వం కింద సుగ్రీవుడి సాయుధ సైనికులు ఆ ప్రాంతాల మీద దాడి చేసి ఆటవికులను కొందరిని చంపి, వారి చర్మాలు వొలిచి తెచ్చారు. కాని ఋష్యమూకం ప్రమాద ప్రాంతం కాసాగింది. యెన్నడూ ఏ రాజకీయాలూ ఎరగని కిష్కింధ పౌరులు "విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదాన్ని చెవులు రిక్కించి వింటున్నారు.

జాంబవంతుడికీ పరిస్థితులు బాధ కలిగించాయి. హనుమంతుడితో మాట్లాడాడు. కాని హనుమంతుడికి కిష్కింధ రాజకీయాలు పట్టలేదు. అతడిప్పుడు సంవత్సరానికి తొమ్మిది నెలలు అయోధ్యలో ఉంటాడు. అతడి అలవాట్లూ భాషా కూడా మారాయి.

"నువ్వు సంకుచిత దృష్టి విడిచి పెట్టాలి. ఇప్పుడు మనం అంతర్జాతీయ దృష్టి అవలంబించాలి. ఈనాటి మన ఆదర్శం స్వరాజ్యంకాదు. రామరాజ్యం. ఆర్యులూ, వానరులూ, రాక్షసులూ, అందరూ ఇందులో పాల్గొనాలి. రామ రామ రామ సీతా!" అని పాడుతూ వెళ్ళాడు హనుమంతుడు.

ఇది జరిగిన మర్నాడే సుగ్రీవుడు తన మిత్రులను పిలిపించి వారికీ విధంగా రాజకీయోపన్యాసం చేశాడు!

"జైరాం! మనం కష్టపడి రామరాజ్యానికి పునాది వేశాం. ఈ పునాదిని మనం రక్షించాలి. లేకపోతే మనం పతనమైపోతాం. ఇది లోతైన పునాది. దీనిమీద కుటీరం నిర్మిస్తామా? నిర్మించం. దివ్య హర్మ్యం నిర్మిస్తాం. పరిస్థితులు మారాయి. పరిస్థితులతోపాటు మనమూ మారాలి. మనలో కొందరం యింకా కిష్కింధా కుటీరాన్ని గురించే కలలు కంటున్నాం. ఇది మానాలి. నిన్నటి మన శత్రువులు నేడు మన మిత్రులయారు. ఇదే రామరాజ్యానికి ప్రథమ సోపానం. ఈ సంధి సమయంలో మనం కొన్ని అవాంతరాలను ఎదుర్కొనవలసి వస్తుంది. అందరమూ కలిసి యెదుర్కొంటే ఈ అవాంతరాలు పటాపంచలైపోతాయి. రాక్షసులు వచ్చి ఇక్కడ అధికారాలు చలాయిస్తున్నారని చాలామంది వాపోతున్నారు. ఇది పొరపాటు. అక్కడ లంకలోకూడా అనేకులు ఇటువంటి దుష్ప్రచారమే చేస్తూ విభీషణుడు శ్రీరామచంద్రమూర్తి తొత్తు అనీ, అక్కడ ఆర్యులు రాజ్యం చేస్తున్నారనీ ప్రచారం సాగుతున్నది. రామరాజ్యాన్ని ప్రతిఘటించే పాపులే ఇట్టి ప్రచారాలు సాగిస్తున్నారు. రాక్షసులు మనకు శత్రువులే అనుకున్నా ఆ విషయాలను మనం ఎంత త్వరగా విస్మరించితే అంత త్వరగా బయటపడతాం. వాళ్ళదగ్గిర నుంచి మనం నేర్చుకోవలసింది చాలా ఉన్నది. రాక్షసుల మీద దుష్ప్రచారం సాగించేవాళ్ళే ఆర్యులపట్ల కూడా దుష్ప్రచారం సాగిస్తున్నారు. ఆర్యులు మనకు ఆప్తులు. వాళ్ళని దూషించే పాపాత్ములే రాక్షసులనుకూడా దూషిస్తున్నారంటే వారి ఆశయాలు మనం సులభంగా గ్రహించవచ్చు. నన్ను గురించి అయోధ్యలో ఒక ప్రసిద్ధ పత్రిక వ్రాసిన సంపాదకీయం చదివి ముగిస్తాను" అన్నాడు సుగ్రీవుడు.

ఆ సంపాదకీయం ఇట్లా ఉన్నది

"కిష్కింధలో జరిగే అల్లరులను గురించి ఎప్పటికప్పుడు వార్తలు వస్తున్నవి. కాని రామరాజ్య వ్యతిరేకులను సుగ్రీవుడు దక్షతతో నిగ్రహించుతూ పరిపాలిస్తున్నందుకు అభినందనీయుడు. సుగ్రీవుడు వొక్క విషయం గ్రహించినట్లయితే అతని పని సుగమం కాగలదు. అతని చుట్టూ ఉన్న వారిలో కొందరు పాతకాలపు వారున్నారు. వీరి దేశభక్తిని గాని, స్వామిభక్తినిగాని శంకించంగాని, వీరు అధికంగా ఇతర పరిస్థితులలో ఉన్నత పదవులకు వచ్చినవారు, యుద్ధరంగంలో నైపుణి ప్రదర్శించినవారు. వీరిలో చాలామంది నూతన పరిస్థితులను అవగాహన చేసుకోలేకుండా ఉన్నారు... ఆర్యులతోనూ,

రాక్షసులతోనూ కూడా సుగ్రీవుడు రాజకీయ పరిజ్ఞానం కలవాడై చేసుకున్న సంబంధాలు రామరాజ్య వ్యాప్తికి ఎంతో దూరం తోడ్పడగల వనటానికి సందేహంలేదు."

దురదృష్టవశాత్తూ జాంబవంతుడు ఈ సుగ్రీవ ప్రసంగంలో చాలావరకు వినలేదు.

పెద్దవాడవుతూండటం వల్లా, స్తంభం చాటున ఉండడం వల్లా అతడు ఆసనంలో చేరగిలబడి ఒక కునుకు తీశాడు. ఆ కునుకులో అతనికొక కల కూడా వచ్చింది....

తాను రుష్యమూకం మీద నిలబడి ఉన్నాడు. అంత దూరాన ఒక బ్రహ్మాండమైన సభ జరుగుతున్నది. కొన్ని వేల మంది వానరులు అక్కడ గుమిగూడారు. ఒకళ్ళ తరవాత ఒకరు ఉపన్యాసాలిస్తున్నారు. వాళ్ళు చెప్పేదేమిటో జాంబవంతుడికి వినిపించలేదు. కాని అన్ని వేలమంది వానరులు ఆ ఉపన్యాసం అంత శ్రద్ధగా ఆలకించటమే అతడికి ఆశ్చర్యం వేసింది. ఒక్క సుగ్రీవుడు తప్ప కిష్కింధలో ఇంతమందిని పోగుచెయ్యగలవాడు లేడు. సుగ్రీవుడు కూడా ఇంతమందిలో ఈ చైతన్యం తీసుకురాలేదు.

"వాళ్ళే నిజమైన కిష్కింధ! నేనెరిగిన కిష్కింధ!" అనుకున్నాడు జాంబవంతుడు.

దృశ్యం మారిపోయింది. కిష్కింధ వీథులన్నీ ప్రజామయం. ఇళ్ళల్లోంచి మంచి దుస్తులు వేసుకున్న వాళ్ళనీ, రాక్షసుల్నీ బయటికి లాగుతున్నారు. కోలాహలం వినిపిస్తున్నది.

దృశ్యం మళ్ళీ మారింది. అది కిష్కింధేకాదు. లంక. అక్కడా ఇదే జనం. ఇదే అల్లరి. ఇళ్ళల్లోనుంచి మంచి దుస్తులు ధరించిన ఆర్యులను లాగేస్తున్నారు.

మళ్ళీ దృశ్యం మారింది. అది అయోధ్య. అక్కడా ప్రజలే. ఎవరో కేకపెట్టారు. "విప్లవం వర్ధిల్లాలి!"

అకస్మాత్తుగా నిశ్శబ్దం. జాంబవంతుడు ఉలిక్కిపడి లేచాడు.

"విప్లవం వర్ధిల్లాలి!" అని పెడబొబ్బ పెట్టాడు.

ప్రసంగం పూర్తిచేసి కూర్చోబోతున్న సుగ్రీవుడు బాణం దెబ్బ తిన్నవాడల్లే అయినాడు.

మర్నాడు జాంబవంతుణ్ణి మంత్రివర్గంలో నుంచి తీసేశారు.

ఈ వార్త తెలియగానే జాంబవంతుడు నవ్వసాగాడు.

"ఏమిటి, నాన్నా నవ్వుతున్నావు?" అన్నది జాంబవతి.

"ప్రజలు స్వాతంత్ర్యం సంపాదించటం నేను కళ్ళారా చూశాను. సుగ్రీవుడు నన్ను ఉద్యోగంలో నుంచి తీసేశాడు. ఆ ప్రజలని ఉద్యోగం నుంచి తియ్యలేడు పాపం!" అన్నాడు జాంబవంతుడు.

***మొదటి ముద్రణ: ఆంధ్రజ్యోతి మాసపత్రిక, ఏప్రిల్ 1950***